క్లుప్తంగా

కళాశాల ఆకస్మిక తనిఖీ



ముక్తేశ్వరంలో విద్యార్థుల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని విద్యార్థుల ఆన్‌లైన్ నమోదును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల డ్రాప్ అవుట్ లేకుండా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందుకే ఎప్పటికప్పుడు స్టూడెంట్ ఇన్‌ఫోను పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ చెప్పారు. కళాశాలకు జెంట్స్ టాయిలెట్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ ఎం.ముక్కంటి, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు ఉన్నారు.

మత్స్యశాఖ అభివృద్ధి అధికారిగా అనిల్‌కుమార్

అయినవిల్లి: మండల మత్స్యశాఖ అధికారిగా ఎ.అనిల్‌కుమార్ బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ కాకినాడలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారిగా పనిచేసినట్లు తెలిపారు. మత్స్యకారులకు, ఆక్వా రైతులకు అందుబాటు ఉంటూ సేవలందిస్తానని తెలిపారు.

వినియోగదారుల హక్కుల ఫోరం అధ్యక్షుడిగా రాజేష్



ఆలమూరు: రాష్ట్ర కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మండల శాఖ అధ్యక్షుడిగా బడుగువానిలంకకు చెందిన నాగిరెడ్డి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు డి.అభిరామ్ నియామక ఉత్తర్వులు బుధవారం వెలువరించారు. వినియోగదారులకు న్యాయబద్ధమైన హక్కుల పరిరక్షణకు తమ వంతు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినియోగదారులు ఏ విధంగానైనా నష్టపోయినా, మోసపోయినా సత్వరమే మండలశాఖను సంప్రదించాలన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని బుధవారం స్వామికి అష్టోత్తర శతకలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్ర జలాలను ఆలయ అర్చకులు వేదమంత్ర పఠనాలతో 108 కలశల్లో ఉంచి, జలాల్లోకి స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు చేశారు. అనంతరం పంచామృతాలతో, అభిషేకం చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో షాపుల నిర్వహణకు టెండర్లు

రాజోలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహణ, పెట్రోల్ బంక్ ఆవరణలో బేకరి, కూల్‌డ్రింక్స్, బస్టాండ్ ఆవరణలో ఖాళీస్థలం లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలుస్తున్నామని డీఎం భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాలను రూ.295 చెల్లించి ఆఫీసు కార్యాలయంలో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను వచ్చే నెల ఒకటో తేదీ మధ్యాహ్నం రెండు గంటలు లోగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు ఓపెన్ చేస్తామన్నారు.

వరినాట్ల సస్యరక్షణపై అవగాహన

రాజోలు: వర్షాల కారణంగా ముంపునకు గురైన వరినాట్ల సస్యరక్షణపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక శాస్త్రవేత్తల బృందం బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. శివకోడు, తాటిపాక ప్రాంతాల్లో శాస్త్రవేత్త ప్రదీప్ ఆధ్వర్యంలో ముంపు వరినాట్లను పరిశీలించారు. వరినాట్లు వేసిన పొలాల్లో ముంపు నీరు తొలగిపోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు ముంపు నీటిలో వరినాట్లు ఉంటే నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. శివకోడు, తాటిపాక గ్రామ వ్యవసాయ సహాయకులు గాయత్రి, శివరామకృష్ణ, అబ్బాస్, సాయి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆత్రేయపురం: గ్రామ శివారు అగ్రహారం వద్ద బుధవారం సత్యసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి వైద్యులు వైద్య సేవలు అందించారు. 73 మందికి కంటి పరీక్షలు, 45 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆపరేషన్ నిమిత్తం 10 మందిని ఆసుపత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు చంటిబాబు, చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

- భయం గుప్పెట్లో లంక గ్రామాలు
- జాగ్రత్తగా ఉండాలన్న అధికారులు



జి.పెదపూడి గ్రామానికి విచ్చేసిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం



వర్షానికి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న అంబాజీపేట ప్రధాన రహదారి

పి.గన్నవరం: గోదావరి ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గినట్టే తగ్గి, మళ్లీ పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వరద, మరో వైపు భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, ఉభయగోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్ వేపై ఐదడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. లంక గ్రామాల ప్రజల కోసం అధికారులు ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేశారు. అధికారులు సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఎటువంటి వరద పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో మండలంలోని జి.పెదపూడి బూరుగులంక రేవులో లంక గ్రామాల ప్రజలకు సహాయం అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ విచ్చేసింది. కమాండర్ బిటన్ సింగ్ నేతృత్వంలో 20 మంది బృంద సభ్యులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వర్షం.. స్తంభించిన జనజీవనం

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయాయి చెరువులను తలపించాయి. మండలంలో దుక్కులు దున్నుకునేందు, వరినాట్లు వేసుకునేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. వర్షం కారణంగా అంబాజీపేటలో బుధవారం నిర్వహించే వారపు సంత, రోడ్లపై వెలసిన చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి.

మామిడికుదురులో..

మామిడికుదురు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. ఓ వైపు పెరుగుతున్న గోదావరి వరద మరో వైపు ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షంతో పాశర్లపూడి, మామిడికుదురు, నగరం గ్రామాల్లోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా ముంపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు కాలనీలో ముంపునీరు చేరడంతో కాలనీ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు.

గోదావరి వరద ఉధృతిపై ఆందోళన

ఆలమూరు: గౌతమీ గోదావరిలో వరద ఉధృతి పెరుగుతుండటంతో పరీవాహక ప్రాంత వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసుశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి లోతట్టు ప్రాంతాల్లోని బడుగువానిలంక, జొన్నాడ లంక గ్రామస్తులను ఏ క్షణాన్నైనా బయటకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకూ నిలకడగా ఉన్న గోదావరి మళ్లీ పెరుగుతుందన్న ఇరిగేషన్ శాఖ హెచ్చరికల జారీతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిలకడగా వరద

అయినవిల్లి: మండలంలోని వరద నిలకడగా ఉంది. ముక్తేశ్వరం వృద్ధ గౌతమిపాయలో వరద నీటి ప్రవాహం కొనసాగుతుంది. పాడిరైతులు వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, శానపల్లిలంకలో పై లంకలు మునిగిపోవడంతో పశువులను మెరక ప్రాంతాలకు తరలించారు.

తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మామిడికుదురు: గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. ఆయన బుధవారం నగరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై చర్చించారు. ముందుగా అప్పనపల్లి కాజ్‌వేను ఎస్పీ పరిశీలించారు. వరద పరిస్థితిపై సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై షేక్ జానీ భాషాతో మాట్లాడారు. వరద తాకిడికి గురయ్యే లంక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో వరద తాకిడికి గురయ్యే గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ చెప్పారు.

బూరుగులంక రేవును పరిశీలించిన ఎస్పీ శ్రీధర్

పి.గన్నవరం: వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో మండలంలోని బూరుగులంక రేవును జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ బుధవారం పరిశీలించారు. పరిమిత సంఖ్యలో మాత్రమే ప్రజలు పడవలపై ప్రయాణించాలని, ప్రతి ఒక్కరూ లైఫ్ జాకెట్‌ను ధరించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం.. ప్రజలకు ఎంతో ఆరోగ్యం



అంబాజీపేటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలకు ఎంతో ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువులతో సాగు చేసే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి రైతు ప్రోత్సహించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.సునీత మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం చేపట్టే 823 మంది ఎస్సీ రైతులకు (ఒక్కో కిట్ రూ.9,500), రూ.78.18 లక్షలు విలువైన విత్తనాలు, డ్రమ్స్, టార్పాలిన్, కిచెన్ గార్డెన్ కిట్స్ అందిస్తున్నామన్నారు. జొన్నలు, మొక్కజొన్న, జీలుగ, పిల్లిపెసర, జనుము, రాగులు, కొర్రలు, సజ్జలు, మినుములు, పెసలు, కందులు, విజిటబుల్ కిట్స్‌తో కలిపి 12 రకాల విత్తనాలను ఇస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పు జిల్లాలో 3003 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులకు రూ.222.68 లక్షల విలువైన కిట్లను ఇవ్వనున్నారు. అంబాజీపేటలో పూర్తిగా శిథిలమైన ఎస్సీ కమ్యూనిటీ కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి, దాని స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ జె.ఎలియాజర్, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ జె.సత్యవతి, మండల వ్యవసాయాధికారి సీహెచ్ విజయ్‌కుమార్, పీఈర్పీ జె.నాగమణిల పర్యవేక్షణలో రైతులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, మైలా ఆనందరావు, పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో కనిపించే దైవాలు డాక్టర్లు



సీనియర్ డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, తదితరులు

రావులపాలెం: కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సమాజానికి డాక్టర్లు అందించిన సేవలు ఎనలేనివని, వైద్యులు కనిపించే దైవాలు అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక విజయవేదికలో మంగళవారం రాత్రి ఐఎంఏ రావులపాలెం ప్రెసిడెంట్ డా.శేషబాబు, సెక్రటరీ డా.రమేష్‌రెడ్డి, డా.గంగిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన వార్షిక సమావేశంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా సీనియర్ డాక్టర్లు, మాజీ ఎమ్మెల్యే డా.ఐఎస్ రాజు, పడాల వెంకటరెడ్డి, మెంటే ఉదయభాస్కరరావు, చిన్నంరాజులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్లను సన్మానించుకునే ఇలాంటి మంచి కార్యక్రమానికి తన తండ్రి డా.చిర్ల సోమసుందరెడ్డి జ్ఞాపకార్థం తనను ఆహ్వానించడం అదృష్టంగా భావిస్తున్నన్నారు. సమాజంలో కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మొక్కే దేవుళ్లు డాక్టర్లు అని, డాక్టర్లను కూడా కొంతమంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని అలాంటి వారి నుంచి వారికి రక్షణ కల్పించడం తన బాధ్యత అన్నారు. డాక్టర్లకు ఏ విధమైన ఇబ్బందులు వచ్చినా వారికి అండగా ఉంటామన్నారు.

నాణ్యమైన దిగుబడులకు దోహదపడాలి



కొత్తపేటలో దేశి శిక్షణ డీలర్లకు తుది పరీక్ష నిర్వహిస్తున్న జ్యోతిర్మయి, భాస్కరరావు

కొత్తపేట: వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానంపై 48 వారపు రోజుల 'దేశి' శిక్షణ వ్యవసాయ, ఉద్యాన పంటల నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడాలని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి డీలర్లకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల్లో భాగంగా గత ఏడాది మే నెల నుంచి కొత్తపేట పరిసర మండలాల ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్లకు డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్స్ (దేశి) 2022-23 బ్యాచ్ శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణ ముగింపులో భాగంగా స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో 40 మంది డీలర్లకు తుది పరీక్ష నిర్వహించారు. అనంతరం శిక్షణ ఫెసిలిటేటర్, రిటైర్డ్ ఏడీఏ వి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీడీ జ్యోతిర్మయి, సైంటిస్టు జి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు. పీడీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు అత్యధిక శాతం డీలర్లపై ఆధారపడి, వారి సలహాలు, సూచనల మేరకు వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్లను వ్యవసాయ సమాజంలో వ్యవసాయ విజ్ఞానవంతులు, సాంకేతిక నిపుణులుగా తయారుచేయుటకు నిర్దేశించినదే ఈ దేశి శిక్షణ కార్యక్రమం అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏడీఏ ఎం.వెంకటరామారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్, రిటైర్డ్ ప్రొఫెసర్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ కె.సీతారామయ్య, ఆత్మ ఏటీఎం ఎం.అభినయ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో వంతెన కల సాకారం



నాడు పాడైపోయిన తొట్టి వంతెన



నేడు నూతనంగా నిర్మించిన వంతెన

మామిడికుదురు: అప్పనపల్లిలోని పాటురేవుపై శిథిలావస్థకు చేరిన తొట్టి వంతెన స్థానే పక్కా వంతెన నిర్మాణం సాకారమైంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవతో ఈ వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చింది. పాటురేవుపై గతంలో నిర్మించిన తొట్టి వంతెన ఒక మాదిరి గోదావరి వరదకు ముంపుబారిన పడి లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. శిథిలస్థితికి చేరిన తొట్టి వంతెనను తొలగించి దాని స్థానే కొత్త వంతెన నిర్మించాలని లంక గ్రామాల ప్రజలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్న ఫలితం లేకపోయింది. గత ఏడాది గోదావరి వరదల సమయంలో ఇక్కడి ముంపు పరిస్థితిని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, వరదలకు ముంపు సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా చర్యలు తీసుకుని ఒక మాదిరి వరదకు ముంపుబారిన పడకుండా పక్కా వంతెన నిర్మించారు. ఈ వంతెన మీదుగా తీరంలోని అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం గ్రామాలకు నిత్యావసరాలు, ఆహారం అందించేందుకు వెసలుబాటు ఏర్పడింది. గతంలో మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేయగానే ఈ వంతెన ముంపునకు గురయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినా కూడా ఈ వంతెనకు ముంపు సమస్య ఉండదు. అంత ఎత్తులో దీన్ని నిర్మించారు. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వే మొదటి ప్రమాద హెచ్చరికకే ముంపుబారిన పడుతుంది. అప్పుడే నూతనంగా నిర్మించిన వంతెన మీదుగా మూడు గ్రామాల ప్రజలు ఏ విధమైన ముంపు సమస్య లేకుండా రాకపోకలు సాగించేందుకు సానుకూలంగా ఉంటుంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న నూతన వంతెన నిర్మాణం జిల్లా కలెక్టర్ శుక్లా చొరవతో సాకారం కావడంపై లంక గ్రామాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సత్యనారాయణ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పేదలకు సహాయం అందించడంలో సీఎం జగన్ ఎప్పుడూ ముందుంటారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న అప్పనపల్లికి చెందిన ఇసుకపట్ల సత్యనారాయణకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరు చేసిన రూ.మూడు లక్షలు చెక్కును బుధవారం ఎమ్మెల్యే చిట్టిబాబు నగరంలోని తన స్వగృహం వద్ద అందజేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో ఇసుకపట్ల సత్యనారాయణ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, పార్టీ నేత గెద్దం వెంకటేశ్వరరావు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై సీఎంకు దరఖాస్తు చేయగా ఆయన స్పందించి ఆర్థికసాయం మంజూరు చేశారని చెప్పారు. ఇటీవల ఈ విధంగా నియోజకవర్గ పరిధిలో పలువురికి సీఎం ఆర్థిక సహాయం మంజూరు చేశారని గుర్తు చేశారు. సీఎం జగన్‌కు ఎమ్మెల్యే చిట్టిబాబు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గెద్దం వెంకటేశ్వరరావు, బత్తుల జనార్దనరావు, బొంతు చందు, పైడి గణేష్, ఇసుకపట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు కొవ్వొత్తుల నివాళి

మామిడికుదురు: కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర వీరులకు మామిడికుదురు దీప్తి స్కూల్ విద్యార్థులు బుధవారం కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. త్రివర్ణ పతకాలు ప్రదర్శిస్తూ అమర వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. సరిహద్దుల్లో జవాన్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశానికి రక్షణగా నిలుస్తున్నారని స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ యక్కలదేవర వెంకన్నబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు మంజూరు

ఆత్రేయపురం: మండలంలోని 17 గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.52.60 లక్షలు మంజూరైనట్లు ఎంపీడీఓ నాతిబుజ్జి తెలిపారు. మండలకేంద్రం ఆత్రేయపురం గ్రామానికి రూ.3,40,483, మెర్లపాలెం రూ. 4,74,553, కట్టుంగ రూ.1,91,014, పేరవరం రూ.2,65,670, వద్దిపర్రు రూ.3,44,476, వసంతవాడ రూ.1,17,824, నార్కెడ్‌మిల్లి రూ.2,48,781, తాడిపూడి రూ.1,08,689, పులిదిండి రూ.83,240, రాజవరం రూ.1,59,865, బొబ్బర్లంక రూ.2,57,763, లొల్ల రూ.4,65,034, ర్యాలి రూ.11,05,164, వెలిచేరు రూ.3,37,897, వాడపల్లి రూ.1,80,229, ఉచ్చిలి రూ.1,89,980, అంకంపాలెం రూ.3,90,496 మంజూరైనట్లు తెలిపారు.

నూతన ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ విడుదల

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఉమా కమండలేశ్వర స్వామి, వాగ్దేవి నగర మహాలక్ష్మి, సమయమంతుల, మాతంశెట్టి వారి అన్నదాన సత్రంలకు నూతన ధర్మకర్తల మండలి నియమించేందుకు ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. ఆసక్తి గల వారి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు దేవస్థానం నందు సంప్రదించాలన్నారు. అలాగే వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

బడి బయటి పిల్లల సర్వే పరిశీలన

రాజోలు: మండలంలో నిర్వహిస్తున్న బడి బయట పిల్లల సర్వేను విద్యాశాఖ సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో ఉండాలని సూచించారు. అలాంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ మేరకు ఎమ్మార్సీ భవనంలో జరుగుతున్న టీచర్స్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ ఎస్.మనోహరం పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

ఆలమూరు: అర్హులందరికీ ఇంటి ముంగిటకే వెళ్లి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సత్వర మంజూరుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని తహసీల్దార్ ఐపి శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. మండలంలోని నవాబుపేట, గుమ్మిలేరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సర్పంచ్‌లు సూరంపూడి ముత్యాలమ్మ, గుణ్ణం రాంబాబు ఆధ్యక్షత వహించారు. జగనన్న సురక్షలో భాగంగా 11 పథకాలకు సంబంధించి నవాబుపేట గ్రామ సచివాల పరిధిలో 438 మందికి, గుమ్మిలేరు గ్రామ సచివాలయ పరిధిలో 629 మందికి ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అక్కడికక్కడే అందజేశారు. డీటీ ఎం.జానకి రాఘవ, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, గృహనిర్మాణ శాఖ ఏఈ దర్నాల శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శులు డి.సుబ్బారావు, జె.అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు సబ్జెక్ట్ కాంప్లెక్స్ మీటింగ్స్ నిర్వహణకు ఉత్తర్వులు

సఖినేటిపల్లి: ఉపాధ్యాయులకు సబ్జెక్ట్ కాంప్లెక్స్ మీటింగ్స్‌లను నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు జిల్లా కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ (సీయంవో) బి.సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం సఖినేటిపల్లి, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఆయా పరిధుల్లోని ప్రైమరీ, హైస్కూల్స్ పాఠశాలల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద, ఆగస్టు-1 నుంచి నిర్వహించనున్న మొదటి దఫా పరీక్షలు గురించి సమావేశంలో టీచర్లకు పలు సూచనలు చేశారు. గెజిటెడ్ ఉపాధ్యాయులు కె.వీరాస్వామి, గోపి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘ నాయకులు నల్లి విశ్వనాథం, జి.విజయ భాస్కరరావు పాల్గొన్నారు.

నగరంలో గుర్రాలపై పీర్ల ఊరేగింపు



గుర్రంపై పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: మొహరం సంతాప కార్యక్రమాల్లో భాగంగా నగరం గ్రామంలో గుర్రాలపై పీర్లను ఊరేగించారు. నగరం గ్రామంలోని హజరత్ ఖాసిమ్ పంజా నుంచి పీర్లను తీశారు. భక్తులు గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహిస్తుండగా గుర్రాలపై పీర్లను పురవీధుల్లో ఊరేగించారు. నగరంలోని పెద పంజీషా నుంచి మామిడికుదురు వరకు ఊరేగింపు జరిగింది. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలో ఖాసిం మెహందీ మజ్లిస్ జరిగింది. మెహందీ మజ్లిస్‌లో భారీగా భక్తులు పాల్గొన్నారు. మత ప్రబోధకులు సయ్యద్ మహ్మద్ అలీ జాఫరీ కర్బలా చరిత్రలో మెహందీకి ఉన్న ప్రాధాన్యతను భక్తులకు వివరించగా భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం

రాజోలు: విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం చేయాలని ఏపీఈపీడీసీఎల్ కన్జ్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరమ్(సీజీఆర్ఎఫ్) చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఈపీడీ సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు అవగాహన సదస్సు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు విద్యుత్ సమస్యలపై అర్జీలు సమర్పించారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, అమలాపురం ఈఈ ఎం.రవికుమార్, ఏడీఈ సీహెచ్.శ్రీనివాసరావు, మలికిపురం, పి.గన్నవరం ఏఈలు ఎం.సతీష్, ఎస్.ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పునరుద్ధరణ

ఆలమూరు: మండలం చెముడులంకలో కొన్నేళ్ల క్రితం సాంకేతిక కారణాల వల్ల తొలగించబడ్డ రేషన్ కార్డుల పునరుద్ధరణ జరిగింది. రేషన్ కార్డుదారుల ఆవేదనను అర్థం చేసుకున్న సర్పంచ్ తమ్మన శ్రీనివాసు స్థానిక గ్రామ సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి బాధితుల స్థితిగతులను పరిశీలించి వివరాలను పొందుపరచారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను పునరుద్ధరించారు. దీంతో సర్పంచ్ తమ్మన బుధవారం లబ్ధిదారులందరికీ స్థానిక పంచాయతీ వద్ద అందజేశారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, డి.చంటి, డి.వెంకటేశ్వరరావు, ఎం.సురేష్, ఎ.వీర్రాజు, బి.వీర వెంకటరావు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫైనలియర్ విద్యార్థులు విద్యను పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్న సందర్భంగా కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు, విశిష్ట అతిథిగా రెండో జోన్ ఆర్జేడీ డాక్టర్ సీహెచ్ కృష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డిగ్రీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదువులు కోసం యూనివర్సిటీలో ప్రవేశించాలన్నారు. అందుకు అనుకూలంగా వారు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ కె.జ్యోతి కళాశాల వార్షిక జాబితాను వివరించారు. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్‌లో గెలుపొందిన విద్యార్థులైన సంధ్యారాణి, అంజలీదేవి, నాగరాజులకు బహుమతులు అందజేశారు. అలాగే కళాశాలలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి, కోఆర్డినేటర్ హరిబాబు, పీడీ యువరాజు, లైబ్రేరియన్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.